క్లుప్తంగా

కంబాలకొండలో ఫిర్యాదుల పెట్టె



కంబాలకొండ టికెట్ కౌంటర్ వద్ద ఏర్పాటు చేసిన ఫిర్యాదులు, సూచనల పెట్టెలు

ఆరిలోవ: ప్రముఖ పర్యాటక కేంద్రం కంబాల కొండ ఎకో టూరిజం పార్కులో అటవీ శాఖ అధికారులు ఫిర్యాదులు, సలహాలు స్వీకరిస్తున్నారు. ఈ మేరకు ఇటీవల ఇక్కడ టికెట్ కౌంటర్ వద్ద ఫిర్యాదులు స్వీకరించే పెట్టె, సూచనలు స్వీకరించే పెట్టె వేర్వేరుగా ఏర్పాటు చేశారు. కంబాల కొండకు వెళ్లే సందర్శకులకు ఎదురైన అసౌకర్యాలు, సమస్యలపై రాసిన చీటీ ఫిర్యాదు పెట్టెలో వేయాలి. లేదంటే ఆ పెట్టె కింద అందుబాటులో రాసిన అటవీ శాఖ రేంజ్ ఆఫీసర్ ఫోన్ నంబర్ 9440810194కు ఫోన్ చేయవచ్చని అధికారులు తెలిపారు. దీంతో పాటు పార్కు అభివృద్ధి, కల్పించాల్సిన సౌకర్యాలు, సూచనలు, సలహాల గురించి రాసిన చీటీలు కూడా ఇక్కడ ఏర్పాటు చేసిన సలహాల పెట్టెలో వేయాలని అధికారులు కోరుతున్నారు.

ముగిసిన ఆన్‌లైన్ శిక్షణ తరగతులు

మద్దిలపాలెం : ఏపీ పీజీ సీఈటీ ప్రవేశ పరీక్ష కోసం నెల రోజులుగా డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో జరుగుతున్న ఆన్‌లైన్ శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు మాట్లాడుతూ ఈ శిక్షణ తరగతులకు రాష్ట్రం నలుమూలల నుంచి శ్రీకాకుళం నుంచి చిత్తూరు వరకూ అనేక మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు చెందిన అధ్యాపకులు రిసోర్స్ పర్సన్లుగా వ్యవహరించారని చెప్పారు.

అద్భుత రుచుల వేదిక 'విస్టా'

బీచ్ రోడ్డు: అద్భుతమైన కమ్మని రుచుల వేదికగా విస్టా పేరుతో డైనింగ్ రెస్టారెంట్‌ను ఆదివారం ప్రారంభిస్తున్నట్లు ది పార్క్ హోటల్ జీఎం బిస్వాస్ తెలిపారు. శనివారం హోటల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ విస్టా రెస్టారెంట్ విశిష్టతలను వివరించారు. ఈ రెస్టారెంట్ నోటికి రుచులతో పాటు కళ్లకు సుందర దృశ్యాలను సాక్షాత్కరించేలా రూపకల్పన చేశామన్నారు. విస్టా బంగాళాఖాతం సముద్ర తీరాన ఆహ్లాదకరమైన వాతావరణంలో సంతృప్తికరమైన రుచులతో మధురానుభూతిని అందిస్తుందన్నారు. ఆదివారం నుంచి ఈ రెస్టారెంట్ అందుబాటులోకి వస్తుందన్నారు.

మర్యాదపూర్వక కలయిక



కేజీహెచ్ సూపరింటెండెంట్‌కు అభినందనలు తెలుపుతున్న జాన్‌వెస్లీ

దాబాగార్డెన్స్: కేజీహెచ్ సూపరింటెండెంట్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన డాక్టర్ శివానంద్‌ను ఆంధ్రప్రదేశ్ స్టేట్ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ బొల్లవరపు జాన్‌వెస్లీ కలిసి, అభినందనలు తెలిపారు. కేజీహెచ్ అభివృద్ధికి తోడ్పడాలని, ఉత్తరాంధ్ర ప్రజలకు చక్కటి సేవలందించాలని కోరారు. కార్యక్రమంలో జీవీఎంసీ కో–ఆప్షన్ సభ్యుడు మహ్మద్ షరీఫ్ పాల్గొన్నారు.

శ్రీరామదూతం.. నమో నమామి

- వాడవాడలా హనుమజ్జయంతి
- భక్తిశ్రద్ధలతో పూజలు చేసిన ప్రజలు

ఆరిలోవ : తూర్పు నియోజకవర్గంలో హనుమజ్జయంతిని శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు చేశారు. ఉదయం నుంచి భక్తులు స్వామిని దర్శించుకున్నారు. పలు ఆలయాల్లో అన్నసమారాధనలు జరిగాయి. ఈ వేడుకల్లో పలువురు నాయకులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆరిలోవ ప్రాంతంలో ఉదయం నుంచి ఆంజనేయస్వామి ఆలయాలు భక్తులతో కళకళలాడాయి. 9వ వార్డు విశాలాక్షినగర్ కోదండరామాలయం, సింహగిరి కాలనీలో ఆంజనేయస్వామి ఆలయం, 10వ వార్డులో డెయిరీ ఫారం వద్ద ఆంజనేయస్వామి ఆలయం, 11వ వార్డోడ్ల బాలాజీనగర్, 12వ వార్డులో శ్రీకాంత్‌నగర్‌లో ఆంజనేయ స్వామి ఆలయాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామిని తమలపాకులు, గారెల దండలతో అలంకరించారు. ఆలయాల్లో భక్తులకు నిర్వాహకులు ప్రసాదం, మంచినీరు పంపిణీ చేశారు.

ఏయూ క్యాంపస్: పెదవాల్తేరులోని పంచముఖ ఆంజనేయునికి, ఈస్ట్ షిర్డీ ఆలయంలోని హనుమంతునికి ప్రత్యేక పూజలు చేశారు. తమలపాకులు, సింధూర పూజ నిర్వహించారు.



12వ వార్డు శ్రీకాంత్‌నగర్‌లో భక్తుల సందడితో ఆంజనేయ స్వామి ఆలయం

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్–6లోని శ్రీవేంకటేశ్వరస్వామి, ప్రసన్న ఆంజనేయస్వామి వారి ఆలయంలో శ్రీహనుమాన్ జయంతి వేడుకను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో కొలువుదీరిన ప్రసన్న ఆంజనేయస్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం రుద్రాభిషేకం, సింధురార్చన, సహస్ర నాగవల్లీదళార్చన పూజలు చేశారు. వివిధ ఫలాలతో నివేదన సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని శ్రీవారిని దర్శించుకున్నారు.

బీచ్ రోడ్డు: హనుమజ్జయంతి సందర్భంగా శనివారం జీవీఎంసీ 22వ వార్డు శివాజీపాలెంలో అన్న సమారాధన నిర్వహించారు. పోలీస్ హౌసింగ్ బోర్డు కార్పొరేషన్ డైరెక్టర్ పీతల గోవింద్ ముఖ్యఅతిథిగా పాల్గొని భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



ఎంవీపీ కాలనీ సెక్టార్–6లో ప్రత్యేక అలంకరణలో హనుమాన్



శివాజీపాలెంలో అన్నప్రసాదం పంపిణీ చేస్తున్న పీతల గోవింద్



12వ వార్డు శ్రీకాంత్‌నగర్‌లో అలంకరణలో ఆంజనేయ స్వామి



సింహగిరి కాలనీలో పూజలు చేస్తున్న భక్తులు



పెదవాల్తేరులో లలిత పీఠంలో హనుమంతునికి అభిషేకం

ఏయూ సమాచారం

విద్యార్థులకు వీసీ అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం డిగ్రీ ఫలితాలలో ప్రతిభ చూపిన విద్యార్థులను వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో శనివారం ఉదయం అభినందించారు. సత్య డిగ్రీ కళాశాలకు చెందిన కొమ్ము రు రమ్య యూనివర్సిటీ టాపర్‌గా నిలిచింది. విజయనగరం జిల్లా పరిధిలో కళాశాల విద్యార్థులు కె.రమ్య, టి.ఊర్మిళ టాపర్‌లుగా నిలిచారు. వారిని వీసీ అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, సత్య గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.సాయి దేవ మణి, విభాగాధిపతి డాక్టర్ ఎస్.వరూధిని పాల్గొన్నారు.

కమనీయం.. సింహాచలేశుని కల్యాణం



నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు



మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఆలయ బేడా మండపంలో ఉదయం 9.30గంటలకు స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేన పూజ,పుణ్యాహవచనం, సంకల్పం, కంణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలలో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం,శేషవస్త్రాలు అందజేశారు.

– శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సహస్రనామార్చన ఘనంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను బేడామండపంలోని వేదికపై అధిష్టంపజేసి 1001 నామాలను పఠిస్తూ స్వామికి తులసితో అర్చన చేశారు.

విశ్రాంత సీఐ కొండకు నివాళి

బీచ్ రోడ్డు: దివంగత విశ్రాంత సీఐ కె.ఎస్.ఎన్.కొండ సంస్మరణ సభ శనివారం సిరిపురంలోని చిల్డ్రన్ ఎరీనాలో ఎస్ఆర్ వేమన అధ్యక్షతన జరిగింది. ముందుగా ఆయన చిత్ర పటానికి ఏసీపీ వివేక్ నందా, తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ కొండను పోలీసులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ ఆనంద్‌రెడ్డి, ఎస్పీ శశిభూషణ్, విశ్రాంత జిల్లా జడ్జిలు డి.లీలావతి, మోర్త రాందాస్, తదితరులు పాల్గొన్నారు.



విశ్రాంత సీఐ కొండ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

త్వరితగతిన బీఆర్‌టీఎస్ విస్తరణ పనులు

జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఆదేశం

దాబాగార్డెన్స్: జీవీఎంసీ జోన్–8 పరిధి అడవివరం నుంచి పాత గోశాల వరకు జరుగుతున్న బీఆర్‌టీఎస్ రోడ్డు విస్తరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు రోడ్డు విస్తరణ పనులను శనివారం జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బీఆర్‌టీఎస్ రోడ్డు విస్తరణ పనులు సకాలంలో పూర్తి చేయాలని, ముఖ్యంగా కాలువలు, కల్వర్టులతో పాటు రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలన్నారు. వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా చూడాలన్నారు. సింహాచలం దేవస్థానానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా రోడ్డుపై దుమ్ము, ధూళి లేవకుండా ఎప్పటికప్పుడు నీటిని చల్లాలని పర్యవేక్షక ఇంజినీర్ వినయ్‌కుమార్‌ను, జోనల్ కమిషనర్ హైమావతిని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహక ఇంజినీర్ సుబ్బారావు, డీసీపీ పద్మజ, ఏసీపీ రఘునాథ్, తదితరులు పాల్గొన్నారు.



బీఆర్‌టీఎస్ విస్తరణ పనులను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ

వర్షం.. బీభత్సం



చినవాల్తేరులో రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టు కొమ్మలు



పెదవాల్తేరులో విరిగిన చెట్టు



లాసన్స్ బే కాలనీలో కారుపై పడిన చెట్టు కొమ్మలు

ఏయూ క్యాంపస్: తూర్పు నియోజకవర్గంలో శుక్రవారం రాత్రి కురిసిన వర్షం బీభత్సం సృష్టించింది. పలు చోట్ల చెట్ల కొమ్మలు విరిగిపోయాయి. కాలువలు పొంగిపొర్లాయి. వర్షపు నీరు రోడ్లపై పారింది. కాలువల్లో పేరుకున్న వ్యర్థాలు, ప్లాస్టిక్ సీసాలు రోడ్లపైకి చేరాయి. వీటిని తొలగించడం పారిశుధ్య సిబ్బందికి తలకుమించిన భారంగా మారింది. లాసన్స్‌బే కాలనీలో చెట్టు కొమ్మ కారుపై పడింది. రోడ్డుకు అడ్డంగా చెట్ల కొమ్మలు పడడంతో శనివారం ఉదయం ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. వెంటనే జీవీఎంసీ సిబ్బంది స్పందించి వాటిని తొలగించారు.

కూలిన హోర్డింగ్

మద్దిలపాలెం : మద్దిలపాలెం కూడలిలో ఓ ప్రకటనకు సంబంధించిన భారీ హోర్డింగ్ శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కూలిపోయింది. రాత్రి వేళ హోర్డింగ్ కూలడంతో ప్రమాదం తప్పింది. అదే పగటి వేళ అయితే ఈ హోర్డింగ్ కింద ఫుట్‌పాత్‌పై రాకపోకలు సాగించే జనంతో పాటు ఆటో స్టాండ్‌లో డ్రైవర్ల ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. ముందస్తు జాగ్రత్తలు లేకుండా భారీ హోర్డింగ్‌లు ఎత్తులో పెట్టడం ఎప్పటికైనా ముప్పేనని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి భారీ హోర్డింగ్‌లు జనం సంచరించే ప్రాంతాలలో ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఏయూ ఇంజినీరింగ్ కళాశాల ముఖ ద్వారం వద్ద కూలిన హోర్డింగ్

అందుబాటులోకి సీబీసీటీ స్కాన్

తగరపువలస : సంగివలస అనిల్ నీరుకొండ దంత వైద్య కళాశాలలో శనివారం అత్యాధునిక సీబీసీటీ స్కాన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. దీనిని జాతీయ దంత వైద్య కౌన్సిల్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సతీష్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నోటి రోగాలు గుర్తించడం, చికిత్సా ప్రణాళికలో ఈ ఆధునిక పరికరం ఉపయోగపడుతుందన్నారు. కళాశాల డీన్ డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ విశాఖ, విజయనగరం వంటి ప్రాంతాలకు వెళ్లకుండా భీమిలి చుట్టూ ఉన్న గ్రామీణ ప్రాంత ప్రజల సౌకర్యార్థం ఈ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్.వంశీకృష్ణారెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



సీటీబీటీ స్కాన్ ప్రారంభిస్తున్న జాతీయ దంత వైద్య కౌన్సిల్ అధ్యక్షుడు సతీష్‌కుమార్ రెడ్డి

కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో పి.శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు.



తులసీదళార్చనలో సిరులతల్లి

చెరువులో వాటర్ ట్యాంకర్ బోల్తా

కొమ్మాది : జీవీఎంసీ 4వ వార్డు కాపులుప్పాడ రాజుగారి చెరువులో శనివారం ఓ వాటర్ ట్యాంకర్ బోల్తా పడింది. ఈ ప్రాంతంలో ఓ చోట నుంచి అనధికారికంగా భారీ ట్యాంకర్ల ద్వారా మంచి నీటిని తరలిస్తుంటారు. ఈ క్రమంలో వాటర్ ట్యాంకర్ లోడ్‌తో వస్తుండగా ఇక్కడ చెరువు వద్ద ఒక్కసారిగా బోల్తాపడింది. ఈ ప్రమాదం నుంచి డ్రైవర్ చాకచక్యంగా బయటపడ్డాడు. గతంలో ఈ చెరువు వద్ద నీటిని తోడుతుండగా అధికారులు హెచ్చరించారు. అయినప్పటికీ కొంతమంది స్వార్థ ప్రయోజనాల కోసం ఇక్కడి నీటిని అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇలాంటి వ్యాపారాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



చెరువులో పడిన వాటర్ ట్యాంకర్

కౌంటింగ్ వేళ అప్రమత్తం

- అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు
- 300 మంది ఫోర్స్‌తో పర్యవేక్షణ
- పక్కాగా 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలు
- ద్వారకా జోన్ సీఐ ఎస్.రమేష్

సీతమ్మధార: ఈ నెల 4న ఏయూ ఇంజినీరింగ్ కళాశాలలో సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్ సీఐ ఎస్.రమేష్ తెలిపారు. ఎక్కడైనా, ఎవరైనా అల్లర్లు, అలజడి సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా శనివారం 'సాక్షి'తో ఆయన మాట్లాడారు.

ఊరేగింపులు, సంబరాలు చేయొద్దు

నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ ఆదేశాల మేరకు ఈ నెల 4వ తేదీ కౌంటింగ్ రోజున రాజకీయ పార్టీలు ఊరేగింపులు, సంబరాలు జరిపితే చర్యలు తప్పవని సీఐ స్పష్టం చేశారు. నగరంలో 144 సెక్షన్ తోపాటు 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉందన్నారు. 300 మంది లా అండ్ ఆర్డర్ పోలీసులు, సెంట్రల్ ఫోర్స్, రిజర్వ్ పోలీసులు, ఇతర పోలీస్ ఫోర్స్ పర్యవేక్షిస్తుంటారని చెప్పారు.

గుంపులుగా ఉండొద్దు

కౌంటింగ్ రోజున ఎక్కడా గుంపులు గుంపులుగా ఉండరాదని, ఇద్దరు కంటే మించి ఉండొద్దని సీఐ రమేష్ తెలిపారు. రౌడీషీటర్లు, పలు కేసుల్లో ఉన్న నేరస్తులపై ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. ఇప్పటికే రౌడీషీటర్లకు ముందస్తు హెచ్చరికలు చేశామని చెప్పారు. ఎక్కడైన పెట్రోల్, మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సమస్యాత్మక ప్రాంతాల్లో నిఘా

ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక ప్రాంతాల్లో సెంట్రల్ ఫోర్స్ పర్యవేక్షణ ఉంటుందని సీఐ చెప్పారు. సీతంపేట రెల్లివీధి, రాజేంద్రనగర్, అశోక్ నగర్, సీతమ్మధార, బాలయ్యశాస్త్రి లేఅవుట్, గాంధీనగర్ తదితర ప్రాంతాల్లో అల్లర్లు, రెచ్చగొట్టే వ్యవహారాలు చేసే వారిపై పోలీస్ ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు.

ప్రజలు, యువతకు విజ్ఞప్తి

ఓట్ల లెక్కింపు రోజున యువకులు, విద్యార్థులను అల్లర్లు జరిగే ప్రాంతాలకు పంపించరాదని వారి తల్లిదండ్రులకు సీఐ రమేష్ విజ్ఞప్తి చేశారు. అనవసర కేసుల్లో ఇరుక్కోవద్దని సూచించారు. రాజకీయ పార్టీల అభ్యర్థుల కార్యాలయం వద్ద పోలీస్ బందోబస్తు ఉంటుందని, గొడవలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల ఫలితాలు విడుదల నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



వైభవంగా విజయ దుర్గాలమ్మ వార్షికోత్సవం

అల్లిపురం: జెండాచెట్టు వీధిలోని విజయదుర్గాలమ్మ ఆలయ 23వ వార్షికోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడి ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచి విశేష పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం ఆలయ ఆవరణలో హోమం జరిపించారు. గణపతి పూజ, అగ్ని ప్రతిష్ఠ, పూర్ణాహుతి కార్యక్రమాలు చేపట్టారు. మధ్యాహ్నం అమ్మవారి సన్నిధిలో అన్నసమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు లింగం శ్రీనివాస్, పుక్కల్ల సత్తిరాజు, యల్లయ్యమ్మ, పుక్కల్ల సోములమ్మ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



విశేష అలంకరణలో విజయదుర్గాలమ్మ

కొనసాగుతున్న దీక్షలు

అగనంపూడి: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన దీక్షలు కొనసాగుతున్నాయి. ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో 1206వ రోజు రిలే దీక్షా శిబిరంలో ఎల్ఎంఎంఎం, ఎస్‌బీఎం విభాగాల కార్మికులు పాల్గొన్నారు. కార్మిక సంఘాల నేతలు మాట్లాడుతూ ఉక్కు కార్మికులు ఉక్కు సంకల్పంతో కర్మాగారాన్ని రక్షించుకోడానికి చిత్తశుద్ధితో విధులు నిర్వహిస్తున్నారన్నారు. ఐక్య ఉద్యమాలతో ఉక్కును కాపాడుకుంటామన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి

పీఎం పాలెం : రోడ్డు పక్కన పడి వున్న వృద్ధుడిని ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... గత నెల 28న జీవీఎంసీ 6వ వార్డు రేవళ్లపాలెం రోడ్డు పక్కన పడి ఉన్న 70 సంవత్సరాల వృద్ధుడిని స్థానిక సచివాలయం గ్రేడ్ – 2 వీఆర్‌వో చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందినట్లు సీఐ తెలిపారు. మృతుడు ఓ యాచకుడని గుర్తించారు.

టాలెంట్ హంట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

బీచ్ రోడ్డు: తెలుగు రాష్ట్రాల్లోని యువతలో ఉన్న డ్యాన్స్, పాటలు, ఆర్ట్ విభాగాల్లో ప్రతిభను వెలికితీసేందుకు టాలెంట్ హంట్‌ను నిర్వహిస్తున్నట్టు నక్షత్ర టాలెంట్ హంట్ నిర్వాహకుడు షాహిద్ అబ్దుల్ తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో శనివారం టాలెంట్ హంట్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీకి సంబంధించి ఈ నెల 15వ తేదీ వరకు, తెలంగాణకు 17వ తేదీ వరకు దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా స్వీకరిస్తామన్నారు. పూర్తి వివరాల కోసం స్టార్ ఆఫ్ ఇండియా ఇన్ పేజీని సందర్శించాలని కోరారు.